అక్రమ వ్యాపారస్తులు, ఖబడ్దార్!

టెంపోరావ్

రామ్మూర్తి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

భార్య రమాదేవి వడ్డిస్తోంది.

"వంకాయల మసాలా పెట్టి బంగాళాదుంపల కూర వండాను, మీకు ఇష్టమని," అందామె.

అతను మాట్లాడలేదు. డైనింగ్ హాల్ నలువైపులా చూశాడు. గది ఇంపుగా అందంగా ఉంది. ఖరీదైన ఫర్నిచర్. పెద్ద చదువు లేకపోయినా బియ్యం వ్యాపారం చేసి అతను లక్షలు గడించాడు, ఇంకా గడిస్తున్నాడు.

రమాదేవి అతనికేసి అదోలా చూసింది.

"ఏమిటలా వున్నారు?" అందామె.

"ఏం లేదు. బాగున్నాను. నాకేం లోటు?" అన్నాడతను

విసుగా:

ఆమె కళ్ళు చిట్లించింది.

"తినండి, అన్నీ మీకు నచ్చేవే!"

రామ్మూర్తి తింటున్నాడు, కాని మనస్సు తిండిమీద లేదు. బయట గదిలోంచి టెలిఫోన్ మోత వినపడ్తోంది.

"నే వెళ్ళి చూస్తా!" అందామె.

ఆమెకంటె ముందు అతను ఫోన్ దగ్గరకు పరుగెత్తి, రిసీవర్ని ఎత్తి, "హల్లో, రామ్మూర్తి స్పీకింగ్!" అన్నాడు.

"మిస్టర్ రామూర్తీ, టైము పదకొండయింది. మరో గంట టైముంది నీకు! పట్నంలో బియ్యం దొరక్క వేలాది ప్రజలు పస్తుంటున్నారు. నువ్వు నీ గోడౌన్లో రహస్యంగా దాచిన రెండువేల బస్తాలను బయటపెట్టి సరైన ధరల్లో అమ్మవలసిన సమయమొచ్చింది! పన్నెండు తర్వాత, అలా నువ్వు చెయ్యకపోతే నీ గోడౌన్లోని బస్తాలన్నీ మాయమవుతాయి. ప్రజల మేలుకోరి మేం చెప్పింది చేస్తావా, లేక దేశద్రోహివై మా శిక్షకు బలవుతావా — నువ్వే నిర్ణయించుకో!"

గంభీరమైన బొంగురు కంఠం! అటువైపున రిసీవర్ పెట్టేసిన చప్పుడైంది. రిసీవర్ని పెట్టేసి రామ్మూర్తి డైనింగ్ గదిలోకి వెళ్ళాడు. అర్ధాకలిగా తిని అతను చెయ్యి కడుక్కున్నాడు.

ఆదుర్దాగా భార్య అతనివైపు చూసింది.

"ఏమీ తినలేదు. అంతా వదిలేశారు. మీ మనస్సు ఎక్కడుందో!" అందామె.

రామ్మూర్తి పెళ్ళాం చెయ్యి పట్టుకుని ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. తనను వేధించే సమస్యను ఎవరికో చెప్తే గాని బరువు తగ్గదు!

"రమా! మనం రహస్యంగా దాచిన బియ్యం బస్తాలను

బయటపెట్టి తక్కువ ధరలకు అమ్మమంటున్నారు. అలా చెయ్యకపోతే గోడౌన్ని లూట్ చేస్తారట!"

"మనదగ్గర అంత స్టాకుందని వాళ్ళకెలా తెల్సింది!" అడిగిందామె.

"ఎలాగో తెల్సింది రమా! ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?"

"పోలీస్ రిపోర్టు ఇవ్వండి!"

అతను ఫక్కున నవ్వాడు.

"అదిరహస్యంగా దాచిన స్టాక్, రమా! అంత స్టాకు నా దగ్గర వుందని ప్రభుత్వానికికూడా తెలియదు. పోలీసు రిపోర్టిస్తే ప్రభుత్వానికి అంతా తెలుస్తుంది, ప్రమాదం!"

"అయితే ఎందుకీ గొడవ! తక్కువ ధరల్లో ప్రజలకు అమ్మేయండి! ప్రజలు మిమ్మల్ని మెచ్చుకుంటారు!"

"ఈనాటి హెచ్చు ధరల్లో అమ్ముకుంటే విశేషంగా లాభం వస్తుంది. వాళ్ళు చెప్పినట్లు అమ్మితే నష్టంకూడా రావచ్చు!"

"నా బుర్ర పనిచేయడంలేదు! ఏం చెయ్యాలో మీరే ఆలోచించండి!" అంది రమా.

2

టైము పన్నెండయింది.

అనాప్పిళ్ళై స్ట్రీట్‌లో వున్న రామ్మూర్తి అండ్ సన్స్, హోల్ సేల్ అండ్ రిటెయిల్ షాపులోకి ఒక స్త్రీ వెళ్ళింది.

రామ్మూర్తి ఆమెకేసి సీరియస్‌గా చూశాడు.

"బియ్యం కావాలి!" అందామె.

"స్టాకు లేదమ్మా!"

"ఎంతో కొంత యివ్వండి. అత్యవసరంగా కావాలి!"

"పది అయిదు రూపాయలు!"

"అంత ఖరీదులో బియ్యం కొని ఎలా బ్రతగ్గలం?"

రామ్మూర్తి జవాబివ్వలేదు. తన షాపులో పనిచేసే వాళ్ళతో మాట్లాడుతున్నాడు.

"ఖరీదు తగ్గించండి!"

"మార్కెట్‌లో బియ్యం లేదమ్మా. అయిదు రూపాయిల రేటులో కొనడం కూడా కష్టం. ఇంకా ధర ఎక్కువవుతుంది," అన్నాడు రామ్మూర్తి.

ఆమె వెనక్కి తిరిగి నీరసంగా బయటకు నడిచింది. గోడమ్మట అనుసరిస్తోంది. స్కూటరుమీద వెళ్తోన్న ఒకతను ఆమె పక్కనే ఆగాడు.

"బియ్యం లేవు! పదికి అయిదు రూపాయిలిస్తే ఇస్తానన్నాడు!"

స్కూటర్ ముందుకు దూసుకుపోయింది.

* * *

మధ్యాహ్నం రెండుదాటింది. రామ్మూర్తి సంతోషంగా సిగరెట్ వెలిగించాడు. ఫోన్‌లో వాళ్ళు ఏదో అన్నారు కాని గోడౌన్‌లోని బస్తాలను పట్టుకెళ్ళడం అంతసులువైన పనికాదు. భయపెట్టగానే తను లొంగిపోతాడని వాళ్ళు అనుకుని వుంటారు. తను ధైర్యం గలవాడనీ, చిల్లిగవ్వ లేకుండా మద్రాసు వచ్చి లక్షలు గడించిన తను పిరికిపంద కాడని వాళ్ళకు తెలియదు!

డాడ్జి కారు షాపుముందు ఆగింది. ఖరీదైన దుస్తులు ధరించిన ఒక సేట్ షాపులోకి నడిచాడు.

"ఈ కంపెనీ యజమాని మీరేనా?" అడిగాడు సేట్.

అతని కుడిచేతికి నాల్గు వుంగరాలున్నాయి. మెళ్ళో బంగారం గొలుసు మెరుస్తోంది.

"నేనే, సార్!" అన్నాడు రామ్మూర్తి.

"మీతో రహస్యంగా మాట్లాడాలి!"

రామ్మూర్తి అతణ్ణి లోపలున్న ఏర్ కండిషండ్ గది లోకి తీసుకువెళ్ళాడు. స్ప్రింగ్ తలుపు వాళ్ళ వెనకనే మూసుకుంది. ఇద్దరూ పెద్ద సోఫాలో కూర్చున్నారు. ఫ్లోరసెంట్ లైట్ వెలుగుతోంది. గదిలో ఎంతో చల్లగా వుంది.

"మిస్టర్!" అన్నాడు సేట్.

"పేరు రామ్మూర్తి!" అన్నాడతను.

"నా పేరు సేట్ గోకులదాస్! నాకు బియ్యం కావాలి! అమ్మకానికి!" అన్నాడతను.

"ఎన్ని బస్తాలు?" అడిగాడు రామ్మూర్తి.

సేట్ ముందుకు వంగాడు. రామ్మూర్తి కేసి నవ్వుతూ చూశాడు.

"నాకు అమ్మడానికి పెర్మిట్ లేదు. మీదగ్గరకొని బియ్యాన్ని నేను మలబార్ కి రహస్యంగా పంపుతాను. అక్కడ విపరీతమైన డిమాండ్ ఏర్పడింది!"

రామ్మూర్తి లోలోపల సంతోషించాడు. తన దగ్గరున్న స్టాకంతా సేట్ కి ఇచ్చేస్తే అటుపైన తనని బెదిరించినవాళ్ళు ఏమీ చెయ్యలేరు!

"బస్తాలో నలభై పళ్ళుంటాయి. ఖరీదు రెండువందలు!" అన్నాడు రామ్మూర్తి.

"ఆ రేటున ఎన్నిబస్తాలివ్వగలరు?" అడిగాడు సేట్.

"మీరు ఎంత తీసుకెళ్ళగలరు?"

"స్కయ్ ఈజ్ ది లిమిట్! నాకు పోలీసులతో రహస్య సంబంధాలున్నాయి. ఎంత స్టాకున్నా పట్టుకుపోతాను!"

"రెండువేల బస్తాలు ఇవ్వగలను. మీరు నాకు నాల్గు

లక్షలు ముందుగా కట్టాలి!"

"లక్ష ఇప్పుడిస్తాను. తతిమ్మా మూడులక్షలూ బస్తాలు నా లారీల్లో వెయ్యగానే చెల్లిస్తాను."

"ఎప్పుడొస్తాయి మీ లారీలు?" అడిగాడు రామ్మూర్తి.

"రాత్రి పన్నెండింటికి మీ గోడౌన్ ముందుంటాయి. ఆ సమయంలో అందరూ నిద్రపోతూవుంటారు."

"అలాగే చేద్దాం. నాదగ్గర బియ్యంకొన్నట్లు మీరు ఎవ్వరికీ చెప్పకూడదు!"

సేట్ నవ్వాడు.

"మిస్టర్ రామ్మూర్తి, నాదిగూడా బ్లాక్ మార్కెట్ వ్యాపారం. నాకు మీరు రసీట్, బిల్లు ఇవ్వనక్కరలేదు. సరుకిచ్చి క్యాష్ తీసుకోండి!"

"అలాగే, సేట్ జీ," అన్నాడు రామ్మూర్తి.

సేట్ గోకులదాస్ తన ప్లాస్టిక్ బాక్ తెరిచాడు. నాలుగు కట్టలను రామ్మూర్తి కిచ్చాడు.

"కట్టల్లో ఇరవైయిదు వేలున్నాయి. ఒక తెల్ల కాగితంమీద లక్ష అడ్వాన్స్ ముట్టినట్లు రాసియ్యండి!"

సంశయిస్తూ రామ్మూర్తి సేట్ వైపు చూశాడు.

"అది అవుసరమా?"

"టెంపరరీగా. తతిమ్మా డబ్బు మీ కిచ్చేటప్పుడు ఈ రసీట్ మీ కిచ్చేస్తాను. చింపి పారేయొచ్చు;"

తెల్లకాగితంమీద రామ్మూర్తి రాసి, సంతకంపెట్టి, తారీఖువేసి అతనికిచ్చాడు.

"రాత్రి పన్నెండింటికి మీ లారీలు అహమ్మద్ రోడ్డు నంబరు 10 కాంపౌండులో వుండాలి. అది బయటినుంచి చూస్తే పెద్దమేడ! దాన్ని నేను గోడౌన్ గా ఉపయోగిస్తున్నాను," అన్నాడు రామ్మూర్తి.

"అక్కడ మీరుంటారా?"

"ఉంటాను."

"బస్తాలు లారీల్లో వేసేవరదాకా ఏ ప్రమాదమూ లేకుండా మీరు చూడాలి. అటుపైన బాధ్యత నాది!"

"ఏ భయం లేదు. అది నా స్వంత భవనం. మా నౌకర్లు ఉంటారు. వాళ్ళను మనం నమ్మొచ్చు!"

సేట్ ను బయటనున్న కారుదాకా సాగనంపాడు రామ్మూర్తి. డాడ్జి కారు చప్పుడు లేకుండా కదిలింది. రామ్మూర్తి తన ఏర్ కండిషండ్ గదిలోకి పరుగెత్తాడు. తన రొటేటింగ్ కుర్చీలో కూర్చుని వెనక్కి వాలాడు. లోలోపల ఎంతో సంతోషంగా వుంది. ఎంతో రహస్యంగా కూడబెట్టిన బస్తాలు మాయమవుతాయేమో అని అతను భయపడ్డాడు. ఇప్పుడా బెంగ లేదు! తన శ్రమ ఫలించింది! లక్షన్నర రూపాయలు లాభం! అదృష్టం తన్ని వరించినది.

టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ని ఎత్తిన అతని చెయ్యి వణుకుతోంది.

"నేనండీ!" అంది రమాదేవి.

"ఓ, నువ్వా!" అన్నాడతను నవ్వుతూ.

"దాన్ని గురించి ఏం చేశారు?"

"సాంతం అమ్మేశాను. మనకి బెంగ లేదు!"

"ఇంత తొందరగా ఎలా అమ్మారు?"

"అదే లక్! రమా, ఒక సేట్ జీ దొరికాడు. అతను మలబార్ కి బియ్యం స్మగుల్ చేస్తున్నాడు. అతనికిచ్చేశాను. మనకు లక్షన్నర లాభం!" అన్నాడతను సగర్వంగా!

"ఇంటికి తొందరగా వచ్చెయ్యండి! పొద్దుట మీరు తిండే తినలేదు!" అందామె.

"వినాయకుడి గుడికి వెళ్ళివస్తాను."

అతను రిసీవర్ పెట్టేశాడు. స్టేట్ ఎక్స్‌ప్రెస్ ఫిల్టరు సిగరెట్ వెలిగించి, పొగ వదుల్తూ కుర్చీలో వెనక్కి వాలాడు.

3

రాత్రి పన్నెండయింది.

అహ్మద్ రోడ్‌లో దీపాలు వెలుగుతున్నాయి. ఇరవై లారీలు కాంపౌండులోకి ప్రవేశించాయి. డాడ్జి కారు పక్క నిలబడిన సేట్ వాటికేసి సంతోషంగా చూశాడు. పక్కనున్న రామ్మూర్తి కేసి తిరిగాడు.

“బెస్ట్ గోడౌన్! ఎవ్వరూ అనుమానించరు!”

“నేను చెప్పానుగా, సేట్ జీ!”

“మిస్టర్ రామ్మూర్తీ, పని తొందరగా కానివ్వండి.”

“మా వాళ్ళు లారీల్లో బస్తాలు వేస్తారు. మనం నా గదిలో కూర్చుందాం.”

రామ్మూర్తి వెనకనే సేట్ నడిచాడు. ఒక విశాలమైన ఎర్ కండిషండ్ గదిలోకి వెళ్ళారు. పెద్ద ఫోమ్ సోఫాల్లో ఇద్దరూ ఆశీనులయ్యారు.

రామ్మూర్తి బజర్ నొక్కాడు. ఒక అందమైన యువతి లోపలకొచ్చింది. సేట్ ఆమెకేసి ఆత్రంగా చూశాడు. సన్నగా, పచ్చగా, వుందామె. పొడుగాటి జడ. స్కర్ట్, వైట్ బ్లౌస్ ధరించింది. చెవులకు పెద్ద రింగులున్నాయి. ఎత్తయిన స్తనాలు. ఎర్రటి పెదిమలు!

“రాణీ, స్కాచ్ అండ్ సోడా! చిప్స్!” అన్నాడు రామ్మూర్తి.

“మీ గోడౌన్‌లో అమ్మాయిలుకూడా వున్నారే!” అన్నాడు సేట్.

“రాణీ ఇక్కడే తల్లితో వుంటోంది. అన్నివిధాలా మనతో సహకరించే యువతి!” అన్నాడు రామ్మూర్తి.

"అటువంటివాళ్ళే కావాలి మనకు!" అన్నాడు సేట్.

రాణీ ట్రేలో అన్నీ తెచ్చి టీపాయిమీద పెట్టింది. రెండు గ్లాసుల్లో విస్కీ పోసి, సోడా కలిపి ఐస్ క్యూబ్స్ వేసింది. దగ్గర్లో వున్న టేబుల్ వరకు నడిచి టేప్ రికార్డర్ను ఆన్ చేసింది. తగ్గు స్వరంలో వెస్టర్న్ ఆర్కెస్ట్రా వినపడ్తోంది. ఆమె బయటకు వెళ్ళిపోయింది. ఇద్దరూ గ్లాసులను ఎత్తారు.

"టు లాస్టింగ్ బిజినెస్!" అన్నాడు రామ్మూర్తి.

"విత్ ప్రాఫిట్!" అన్నాడు సేట్.

"ఎప్పుడు కావాల్సినా నేను మీకు స్టాకు సప్లయి చెయ్యగలను."

"అందుకే మీ దగ్గర కొచ్చాను," అన్నాడు సేట్.

గ్లాసులు ఖాళీ అయ్యాయి. రామ్మూర్తి గ్లాసుల్లో స్కాచ్ విస్కీ మళ్ళా పోసి, సోడా కలిపి, ఐస్ వేశాడు. ఇద్దరూ సిగరెట్లు కాలుస్తున్నారు. గదిలో చల్లగా, హాయిగా వుంది. "ఆ బాలెన్స్ క్యాష్ ఇచ్చేస్తే మన పని పూర్తవుతుంది," అన్నాడు రామ్మూర్తి.

సేట్ పన్నెండు కట్టలుతీసి సోఫామీద పడేశాడు. రామ్మూర్తి కట్టల్ని లెఖ్ఖెట్టుకుని తన హేండ్ బాగ్ లో పెట్టుకున్నాడు. సేటు మొదటిచ్చిన లక్షా అదే బాగ్ లో వుంది. సేట్ రసీట్ ను రామ్మూర్తి కిచ్చాడు. అతను దాన్ని చింపి సోఫా వెనక పడేశాడు.

"మద్రాస్ లో మీ రెక్కడుంటున్నారు?" అడిగాడు రామ్మూర్తి.

సేట్ అతనికేసి విచిత్రంగా చూశాడు.

"నాది మద్రాస్ కాదు. బొంబాయి. నా పేరు గోకులదాస్ కాదు. స్మగ్లర్స్ అన్నింటికీ తెగించి ఎన్నో మారు వేషాలు వెయ్యాలి. మనం మరికొంత దగ్గరయ్యాక నా

అసలు పేరు, అడ్రెస్ మీకు చెప్తాను.''

గ్లాసులను రామ్మూర్తి మళ్లా నింపాడు. విస్కీ రామ్మూర్తిమీద పనిచేస్తోంది. అతను ముద్దగా మాట్లాడు తున్నాడు. కాని సేట్‌లో అంతగా మార్పులేదు. విస్కీ సేవించడం అతనికి బాగా అలవాటేమో!

"మనం దగ్గరయ్యాం! వుయ్యార్ బ్రదర్స్ యిన్ స్మగ్లింగ్ రైస్!'' అన్నాడు రామ్మూర్తి నవ్వుతూ.

"వెల్ సెడ్!'' అన్నాడు సేట్.

స్కర్ట్ ధరించిన యువతి లోపల కొచ్చింది.

"లోడింగ్ ఎంతవరకూ అయింది?'' అడిగాడు సేట్.

"పని సాగుతోంది సార్!'' అందామె.

"వాళ్ళు లాకీల్లో బస్తాలను లోడ్ చేస్తున్నారు. మనం ఇక్కడ స్కాచ్‌ని మన శరీరాల్లోకి లోడ్ చేస్తున్నాం!'' అన్నాడు రామ్మూర్తి.

సేట్ అతనికేసి వింతగా చూస్తున్నాడు. రాణీ రామ్మూర్తి పక్కనే కూర్చుంది. అతని గ్లాసులో మరి కొంత విస్కీ పోసింది.

"ఓవర్ డోస్!'' అన్నాడు సేట్.

"తాగినప్పుడు ఆయన చక్కగా మాట్లాడతారు,'' అందామె.

రెండు దాటింది. తప్పతాగిన రామ్మూర్తి సోఫాలో పడుకుని వున్నాడు. రాణీ అతడ్ని గట్టిగా తట్టింది. అతను లేచి కూర్చున్నాడు. నిద్రమత్తులో ఆమెకేసి చూశాడు.

"రాణీ, నువ్వా?'' అన్నాడతను.

"మీరు గోడౌన్ భవనంలో మత్తుగా నిద్రపోతు న్నారు. మీ భార్య మూడుసార్లు ఫోన్ చేశారు. మీరు బిజీగా ఉన్నారని చెప్పాను,'' అందామె.

"సేట్ ఏడీ?'' అడిగాడు రామ్మూర్తి.

"బియ్యం బస్తాలు వేసుకుని లారీలు వెళ్ళిపోయాయి. సేట్ కూడా వెళ్ళిపోయారు!" అందామె.

నేలమీద పడున్న తన ప్లాస్టిక్ బాగ్‌ను అతను అందుకున్నాడు. తెరిచి చూశాడు. నోట్లకట్టలు లేవు!

"రాణీ, ఇందులో నోట్లకట్టలుండాలి! అవి ఏమయ్యాయి" అర్చాడతను.

"నాకు తెలియదు, సార్. సేట్ నాతో చెప్పి వెళ్ళిపోయారు. మీరు నిద్రపోతున్నారు!"

టెలిఫోన్ మ్రోగింది. అతను మెల్లిగా వెళ్ళి రిసీవర్ని అందుకున్నాడు.

"మిస్టర్ రామ్మూర్తీ, నీ రెండువేల బస్తాలూ ప్రజలకు పంచి పెడుతున్నాం. దేశద్రోహీ, కళ్ళు తెరుచుకో! ప్రజల్ని మోసంచేసి నువ్వు డబ్బు గడించలేవు!" అంది గంభీర కంఠం.

"హలో, నా స్టాకంతా నే నమ్మేశాను," అన్నాడు రామ్మూర్తి.

"యూ ఆర్ ఫూల్! సేట్ గోకులదాస్ మా మనిషి. నీకు పైసా ఇవ్వకుండా బస్తాలు మాయమయ్యాయి. మా మాట వినకపోవడం వలన ఎంత నష్టపోయావో ఆలోచించుకో!" అటువైపునుంచి క్లిక్ శబ్దం ధ్వనించింది.

రామ్మూర్తి రిసీవర్ని పెట్టేశాడు. మెల్లిగా వెళ్ళి సోఫాలో చతికిలబడ్డాడు.

"రాణీ, నా స్టాకంతా గాలిలో ఎగిరిపోయింది! రెండున్నర లక్షలు నష్టం," అన్నాడతను, ఏడుపు కంఠంతో.

4

పడక కుర్చీలో వెనక్కి జార్లాబడి డిటెక్టివ్ వాలి చుట్ట పీలుస్తున్నాడు. ఎదురుగా రామ్మూర్తి కూర్చుని

ఉన్నాడు.

"అబ్బాయి, చాలా గాభరాగా ఉన్నావు!" అన్నాడు వాలి.

"వాలిగారూ, రెండువేల బస్తాల బియ్యాన్ని వాళ్ళు లారీల్లో వేసుకుని పారిపోయారు. నాకు చిల్లిగవ్వ రాలేదు. రెండున్నర లక్షలు నాకు నష్టమొచ్చింది," అన్నాడు రామ్మూర్తి.

"వివరంగా చెప్పు!" అన్నాడు వాలి.

జరిగినదంతా రామ్మూర్తి వివరంగా చెప్పాడు. వాలి నవ్వుతూ అతనివైపు చూశాడు.

"నువ్వు పోలీస్ రిపోర్టిచ్చావా?"

"లేదు, సార్!"

"ఎందుకివ్వలేదు?"

"ఆ స్టాకు నేను రహస్యంగా దాచాను. ఖరీదు ఎక్కువైనా నాకు అమ్మాలని నా ఉద్దేశం! అన్ డిక్లేర్డ్ స్టాక్, సార్!"

"డబ్బుకోసం కక్కుర్తిపడి సర్వాన్నీ కోల్పోయావ్!" అన్నాడు వాలి.

"వాలిగారూ, వాళ్ళెవరో మీరు కనుక్కోవాలి! అందుకోసం ఎంత ఖర్చయినా నేను భరిస్తాను."

"ఆల్ రైట్, ప్రయత్నిస్తాను," అన్నాడు వాలి.

"సేట్ గోకులదాస్ అతని అసలుపేరు కాదు. అతను బొంబాయినుంచి మద్రాస్ వచ్చాడు."

"నీతో అతను అబద్ధం చెప్పుండొచ్చు!" అన్నాడు వాలి.

"మీరు చెప్పేది నిజమే సార్. అతను బాగా నటించాడు. అతనొక స్మగ్లర్ అని నేను నమ్మాను. నాకు ఫోన్ చేసినవాళ్లే ఆవిధంగా నన్ను మోసగిస్తారని నేననుకోలేదు!" అన్నాడు రామ్మూర్తి.

"అబ్బాయి, ప్రజలకు అన్నంకావాలి! వేలాది బస్తాలు దాచి నువ్వు ప్రజలకు తిండిలేకుండా చేశావు. అందుకు శిక్ష అనుభవించాలి," అన్నాడు వాలి.

"వాలిగారూ, నన్నొక ద్రోహిగా భావించకండి! మన దేశంలో అందరూ డబ్బుకోసం తాపత్రయ పడుతున్నారు. డబ్బు గడించాలనే ఉద్దేశంతో నేను స్టాకును దాచాను. నా స్టాకు ఆ విధంగా పట్టుకుపోవడం పచ్చిమోసం!" అన్నాడు రామ్మూర్తి.

"అబ్బాయి, నీకు ఫోన్ చేసినవాళ్ళు ప్రజలకు మంచి చేస్తున్నారు. దాన్ని గురించి నాకు సందేహంలేదు. అయినా వాళ్ళు చేసినది చట్టానికి విరుద్ధం!" అన్నాడు వాలి.

రామ్మూర్తి కుర్చీలోంచి లేచాడు. పదివేల రూపాయలకు చెక్కు రాసి వాలికిచ్చాడు.

"ఇది అడ్వాన్సుగా వుంచుకోండి!" అన్నాడు రామ్మూర్తి.

5

కేశవులు భోజనంచేసి సిగరెట్ పీలుస్తూ ఫోమ్ బెడ్ మీద పడుకున్నాడు. టెలిఫోన్ మ్రోగింది. అతను రిసీవర్ని ఎత్తి, "హల్లో, కేశవులు స్పీకింగ్!" అన్నాడు.

"మిస్టర్ కేశవులూ, నువ్వు రహస్యంగా వేరుశెనగ నూనెని దాచావు. వెంటనే ఆ డబ్బాలను బయటపెట్టి ప్రజలకు సరైన ధరల్లో అమ్ము! అమ్మకపోతే నీ గొడౌన్లో వున్న డబ్బాలన్నీ మాయమవుతాయి!" అంటోంది గంభీర కంఠం.

ఏం చెప్పాలో తోచక కేశవులు మౌనంగా వున్నాడు.

"మిస్టర్ కేశవులూ, తెలిసిందా?"

"తెలిసింది," అన్నాడతను.

"ఏం చెయ్యదల్చావు?"

"మీ ఇష్టమొచ్చింది చేసుకోండి. నా కా భయం లేదు," అన్నాడు కేశవులు.

"గుడ్ నైట్!" అని, అటువైపున రిసీవర్ పెట్టేయ బడింది.

కేశవులు రిసీవర్ని పెట్టేశాడు. అతని భార్య సుమతి కిళ్లీని నవ్వుతూ అందించింది.

"ఏమిటండీ! అలా వున్నారు?" అడిగిందామె.

"ఎవరో నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు, సుమతీ! బ్లాక్ మెయిలర్ కి లొంగకూడదు," అన్నాడతను.

"దేన్ని గురించి?" అడిగిందామె.

"నా దగ్గరున్న గ్రౌండ్ నట్ ఆయిల్ని సరైన ధరల్లో ప్రజలకు అమ్మాలిట!"

"అమ్మేయండి! గ్రౌండ్ నట్ నూనె దొరక్క ఎందరో కష్టపడుతున్నారు," అందామె.

"సుమతీ, యూ ఆర్ ఫూల్! మనకు ఎంతో లాభం వస్తుందని ఆశిస్తున్నాను. వాళ్ళు చెప్పినట్లుచేసి నష్టపో మంటావా?"

"ప్రజలు బతికుంటేనేగా ఏ వ్యాపారమైనా సాగేది? వాళ్ళుపోతే మీరు ఏం చెయ్యగలరు?" అంది సుమతి.

కేశవులు ఆమెను తనమీదకు లాక్కున్నాడు. సుమతి అమాయకురాలు! ఆమె పెదిమలను అతను బలంగా ముద్దెట్టుకున్నాడు.

"సుమతీ, డబ్బు చేసుకునే అవకాశం వచ్చినపుడు మనం వదులుకోకూడదు. మంత్రులు లంచాలు తీసుకుంటు న్నారు. మనం ఎక్కువ ధరకి అమ్మితే పోయిందేమిటి?" అన్నాడతను.

సుమతి మాట్లాడలేదు. వ్యాపారమంటే ఏమిటో ఆమెకు తెలియదు. భర్త కేశవులకు వదిలేయడం మంచిది!

* * *

రాత్రి రెండు దాటింది. టెలిఫోన్ మ్రోగుతోంది. విసుక్కుంటూ అతడు రిసీవర్ని ఎత్తాడు.

"హలో!" అన్నాడతను.

"గోడౌన్ వాచ్‌మన్ ప్రతాప్, సార్!"

"ఏమిటి సంగతి?"

"గోడౌన్‌లోని నూనెడబ్బాలన్నీ పోయాయి, సార్. వాళ్ళు పట్టుకుపోయారు. నన్ను తాళ్ళతో కట్టేశారు. వాళ్ళు పోయాక నేను మీకు ఫోన్ చేస్తున్నాను!"

"ఎవరు వాళ్ళు?"

"చాలామంది వచ్చారు సార్. పది లారీ లొచ్చాయి సార్. లారీల్లో డబ్బాలు పెట్టుకుని వాళ్ళు వెళ్ళి పోయారు!"

"ప్రతాప్. నువ్వు వాచ్‌మన్ పదవికి పనికిరావు. పోలీసుకు ఎందుకు ఫోన్ చెయ్యలేదు?" అడిగాడు కేశవులు.

"నేను కదిలే స్థితిలో లేను, సార్. నా అరుపులు విని సమీపంలో ఉండేవాళ్ళు వచ్చి నన్ను కట్టిన తాళ్ళను విప్పేశారు. అంతవరకూ నేను ఖైదీని!"

కేశవులు చిరాకుతో రిసీవర్ని పెట్టేశాడు. సుమతి లేచి కళ్ళు నులుముకుంటోంది.

"ఇంత రాత్రివేళ ఎవరండీ ఫోన్ చేస్తే?" అడిగిందామె.

"గోడౌన్ వాచ్‌మన్!" అన్నాడతను.

"ఏమైందట?"

"గోడౌన్‌లోవున్న నూనెడబ్బాలను ఎవరో ఎత్తుకు

పోయారు. వాచ్‌మన్‌ని వాళ్ళు తాళ్ళతో కట్టేశారు!'' అన్నాడతను.

ఆమె ఉలిక్కిపడింది.

''నేను చెప్తే మీరు వినలేదు! ఆ డబ్బాలను అమ్మేస్తే ప్రజలు సంతోషించేవారు. ఇప్పుడు మనకు నష్టంగా!'' అందామె.

''వాళ్ళకు బుద్ధి చెప్పాలి!'' అన్నాడు కేశవులు, కోపంగా.

6

పోలీస్ కమీషనర్‌కి ఎదురుగా వాలి కూర్చున్నాడు.

కమీషనర్ కామత్ నవ్వుతూ వాలికేసి చూశాడు.

''వాలిగారూ, తమ దర్శనం అయి చాలా కాలమైంది!''

వాలి అమాయకుడిలా నవ్వాడు. అతని కళ్ళు మెరుస్తున్నాయి. పెద్దముఖం, విశాలమైన నుదురు. బుగ్గమీసాలు, పళ్ళమధ్య పొడుగాటి చుట్ట!

''కామత్ భాయ్ రెండువేల బస్తాల బియ్యం మీకు దొరికినట్లు వార్త అందింది. దాన్ని గురించి వివరంగా చెప్పు!'' అన్నాడు వాలి.

''రాత్రి మూడింటికి ముఖ్యమంత్రిగార్కి ఎవడో ఆకాశరామన్న ఫోన్ కాల్ చేసి ఇరవై లారీల్లో బియ్యంబస్తాలు ఉన్నాయనీ, లారీలు పూనమల్లి హైరోడ్డులో హోటల్ అమీన్ ముందు ఆపబడి వున్నాయనీ, వాటిని ముట్టడించి బస్తాలను స్వాధీనం చేసుకుని ప్రజలకు తక్కువ ధరలో అమ్మమనీ చెప్పాడతను.''

''అటుపైన ఏం జరిగింది?''

''ముఖ్యమంత్రిగారు ఆ వార్తను నాకు అందించారు. మేం లారీలనూ, డ్రయివర్లనూ పట్టుకున్నాం. సివిల్ సప్లయిస్ కమీషనర్ బియ్యంబస్తాలను స్వాధీనం చేసుకున్నారు.

కోఆపరేటివ్ స్టోర్స్ ద్వారా ఆ బియ్యాన్ని ప్రజలకు కిలో 2.60 రేటున అమ్ముతున్నారు."

"ఆ లారీలు ఎవరివి?"

"మురుగన్ లారీ సర్వీస్ కంపెనీవి. ఆ కంపెనీవాళ్ళు మోసపోయారు."

"లారీల్లో వాళ్ళు బస్తాలను ఎక్కడకు తీసుకెళ్తున్నారు?"

"త్రివేండ్రమ్ వెళ్ళాలని లారీలను అద్దెకు మాట్లాడారు. హోటల్ అవినాష్ ముందు ఆపమని వాళ్ళు ఉత్తరువిచ్చారు."

"కామత్ భాయ్, ఆ బస్తాలను ప్రభుత్వానికి అందజేయాలనే ఉద్దేశంతో లారీలను హోటల్ ముందు ఆపమని ఫోన్ కాల్ చేసుండాలెవరో!" అన్నాడు వాలి.

"ఇది విచిత్రంగావుంది, వాలిగారూ. రెండు వేల బస్తాలు! కొన్ని లక్షలు విలువుంటుంది. కాని ఆ స్టాకు ఎవరిదో ఇంతవరకూ తెలియలేదు!"

"బస్తాలను లారీల్లో ఎక్కడ వేశారో తెలుసుకొంటే స్టాకెవరిదో తేల్తుంది," అన్నాడు వాలి.

"లోడ్ చేసేటప్పుడు లారీ కంపెనీ డ్రయివర్లు లేరట. వేరే డ్రయివర్లను వాళ్ళు ఉపయోగించారు."

"అన్ డిక్లేర్డ్ స్టాకయివుండాలి!" అన్నాడు వాలి.

"యూ ఆర్ రైట్, సార్. ఇది నాదని క్లెయిమ్ చేసే ధైర్యంలేదు, ఎవ్వరికీ!"

"కామత్ భాయ్, స్మగ్లర్స్ నష్టాలను లెఖ చేయరు. క్లిష్టపరిస్థితులలో సరుకును వదిలేసి పారిపోతారు," అని వాలి లేచాడు.

"వాలిగారూ, మరో విషయం మీకు చెప్పాలి!"

"నిన్నరాత్రి ఎవరో ముఖ్యమంత్రికి ఫోన్ చేశా

వెయ్యి వేరుసెనగ నూనెడబ్బాలను మేం స్వాధీనం చేసుకున్నాం. ఇరవై కిలోల డబ్బాలు! వాటినికూడా ప్రజలకు కోఆపరేటివ్స ద్వారా అమ్ముతున్నారు.”

వాలి కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు! చుట్ట పొగ రింగుల్లో పైకిలేస్తోంది. రామ్మూర్తిలాగా మరెందరో దురాశకు పోయి ఆ నూనెడబ్బాలను పోగొట్టుకొని వుంటారు!

వాలి కళ్ళు తెరిచి కామత్ వైపు చూశాడు.

“కామత్ భాయ్, మనుషులకు అత్యవసరమైన వస్తువుల ధరలు విశేషంగా పెరిగిపోయాయి. రూపాయి విలువ ఈనాడు 33 పైసలకు దిగిపోయింది. ఇటువంటి సమయాల్లో తక్కువ జీతగాళ్ళు బ్రతకడానికి ముప్పతిప్పలూ పడాలి! ఈ పరిస్థితుల్లో డబ్బు చేసుకోవాలని వ్యాపారస్తులు చూస్తున్నారు. స్టాకును దాచి బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. ప్రభుత్వం దాన్ని అరికట్టలేకపోతోంది! మద్రాస్ పట్నంలో ఏదో సంఘం ప్రజల మంచికోసం రహస్యంగా పాటుబడ్తోంది! రహస్యంగా దాచిన స్టాకును ఆ సంఘం బయటపెట్టి ప్రభుత్వానికి అప్పగిస్తోంది!” అన్నాడు వాలి.

“వాళ్ళు చేసేది మంచిపనైనా, అది మన చట్టప్రకారం నేరం, వాలిగారూ! ఎక్కడేనా స్టాక్ దాచారని మాకు అందిస్తే మేమే వెళ్ళి రెయిడ్ చేస్తాంగా!” అన్నాడు కామత్.

వాలి విచిత్రంగా నవ్వాడు.

“కామత్ భాయ్, ఆ సంఘానికి మీమీద అంతగా నమ్మకం లేకపోవచ్చు! దేశంలో కరప్షన్ ఎక్కువగా వుందని వాళ్ళకు తెలుసు!”

కమీషనర్ కామత్ సీరియస్‌గా వాలికేసి చూశాడు.

“అటువంటి సంఘాలు వుండడం మంచిదికాదు, సార్.

ఇప్పుడు మనం కళ్ళు మూసుకుంటే తర్వాత ఆ సంఘం ప్రభుత్వానికి పక్కలో బల్లెం అవుతుంది! భయపెట్టి, బ్లాక్ మెయిల్ చేసి స్టాకును బయటపెట్టడం చట్టవిరుద్ధం!"

వాలి కుర్చీలోంచి లేచాడు. కమీషనర్ కామత్ లేచి వాలి దగ్గరగా నడిచాడు.

"వాలిగారూ, ఆ సంఘాన్ని మనం నిర్మూలించాలి! అది పెరిగి పెద్దదయితే ప్రభుత్వానికే ప్రమాదం. పారలెల్ ప్రభుత్వాన్ని చివరకు ఆ సంఘం స్థాపిస్తుంది! దాని మూలంగా లాభాలు పొందిన ప్రజలు దాన్నే బలపరుస్తారు! వాలిగారూ, మీ సహాయం నాకు కావాలి! ఆ సంఘాన్ని మనం రద్దుచేయాలి! ఆ సంఘం తమ కార్యక్రమాలను చట్టరీత్యా బాహాటంగా చేస్తే నేను వద్దనను. కాని ఇలా రహస్యంగా పనిచేయడం దేశానికి మంచిది కాదు," అన్నాడు కామత్.

7

విశాలమైన హాల్లో యాభైమంది కుర్చీల్లో కూర్చున్నారు. ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. ఏర్ కండిషండ్ గది! ఎదురుగా వున్న ఎత్తయిన ఖాళీ కుర్చీవైపు అందరూ చూస్తున్నారు.

పచ్చగా, పొడుగ్గా వున్న ఒకతను గబగబా వచ్చి ఆ కుర్చీలో కూర్చున్నాడు. పంచ, జుబ్బా ధరించాడతను. కళ్ళు జ్యోతుల్లా మెరుస్తున్నాయి.

"కామ్రేడ్స్, భారత్ జిందాబాద్!" అన్నాడతను.

"భారత్ జిందాబాద్!" అరిచారందరూ.

"కామ్రేడ్స్, గతవారంలో మనం ఎంతో సాధించగల్గాం. పట్నంలోని ప్రజలకు బియ్యం, నూనె కొరత లేకుండా చేశాం. దమ్మిడీ ఖర్చు లేకుండా దొరికిన సరకును

ప్రభుత్వం తక్కువ ధరల్లో ప్రజలకు అమ్ముతోంది! ఇంతే వరకూ మంచిదే. ఈ పట్నంలోని ప్రజలకు మనం చేసిన సేవ అమోఘం. కాని మన రాష్ట్రంలోని తదితర పట్టణాల్లో ప్రజలు కష్టపడుతున్నారు. మన సంఘాన్ని రాష్ట్రమంతటా వ్యాపించేట్లు చేయాలని నేనొక నిశ్చయానికి వచ్చాను. అది మీ సమ్మతిమీద ఆధారపడివుంటుంది!" అన్నాడతను.

"ఇన్ ఫ్లేషన్ లో ఇరుక్కుని తిండికోసం అష్టకష్టాలూ పడే ప్రజలకోసం మీరేంచేసినా మేం అంగీకరిస్తాం," అన్నాడొకతను.

"మన సేవ్ ది పీపుల్ సొసైటీకి మీరు బాస్! మీ మాటకు తిరుగులేదు!" అన్నాడు మరొకతను.

"కామ్రేడ్స్, నేను నియంతనుకాను. మీరు బాస్ గా ఎన్నుకొని నన్ను కుర్చీలో కూర్చోబెట్టారు. ఈ కుర్చీలో కూర్చుని మన సంస్థను పెంపొందించే అవకాశం మీ అందరికీ లభిస్తుంది. మన సంస్థ స్వార్థరహితంగా పనిచేస్తుంది. సామాన్య ప్రజలను కాపాడ్డంకోసం మనం కంకణం కట్టుకున్నాం. మనం చేసే కార్యక్రమాలు ఇటుపైన రాష్ట్రంలోని వారందరకూ ఉపయోగపడ్తాయి! మన సంస్థకు బ్రాంచెస్ స్థాపిస్తున్నాను. శరవేగంగా అంతా జరుగుతుంది," అన్నాడు బాస్.

"చెయ్యండి!" అన్నారందరూ.

బాస్ ముఖం సీరియస్ గా అయింది.

"మన సంఘాన్ని నిర్మూలించాలనే వుద్దేశంతో ప్రఖ్యాత డిటెక్టివ్ వాలిగారు పరిశోధన సాగిస్తున్నారని నాకు వార్తలొచ్చాయి. వాలిగారు దేశభక్తులు. ప్రజలంటే ఆయనకు ఎంతో అభిమానం. ఆయన్నికూడా మన

సంస్థలో చేర్పడానికి ప్రయత్నాలు. రహస్యంగా జరుపుతాను!"

"స్ప్లెన్‌డిడ్!" అన్నారందరూ.

"కాంగ్రేట్స్, బైబై!" అన్నాడు బాస్.

8

కరుపయ్యా టేప్ రికార్డర్ ఆన్ చేసి స్కాచ్ విస్కీ సేవిస్తున్నాడు. పక్కనే అతని సెక్రటరీ మాలతి కూర్చుని వుంది. ఏర్‌కండిషండ్ గదిలో లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

మాలతి వయస్సు పదహారేళ్ళు. తండ్రి కుంటివాడు. ఇంట్లో గడవక ఆమె ఈ ఉద్యోగంలో చేరింది. మాలతి టైము చూసింది.

"ఏడైంది సార్! నేను ఇంటికి వెళ్తాను!"

కరుపయ్యా ఆమె కేసి ఆకలితో చూశాడు. నల్లటి బొగ్గులా వున్నాడతను. గారగట్టిన పళ్ళు. వికృతమైన ముఖం, మొహంనిండా స్ఫోటకం మచ్చలు!

అతని చెయ్యి ఆమె నడుమును ముట్టింది. ఆమె కళ్ళల్లోకి అతను ఆత్రంగా చూశాడు.

"మాలతీ, నువ్వు రెండు వందలు అడ్వాన్స్ అడిగావు. ఇస్తాను!"

ఆమె సంతోషించింది. తండ్రి చేసిన అప్పులు ఆ డబ్బుతో తీర్చొచ్చు! ఇటుపైన తన తండ్రికి సుఖంగా నిద్రపడుతుంది!

కరుపయ్యా చటుక్కున ముందుకువంగి ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు. విదిలించుకుని మాలతి లేచి దూరంగా వెళ్ళింది. రుమాల్తో పెదిమలను తుడుచుకుంది. చెడు వాసన!

అతను కోపంగా ఆమెకేసి చూశాడు.

"నన్ను వద్దంటే నువ్వీ లోకంలో బ్రతకలేవ్!" అరిచాడతను.

ఆమె వణుకుతోంది.

"నన్ను పోనివ్వండి!" అందామె.

అతను తూలుతూ లేచాడు. ఆమె చెయ్యి పట్టుకుని గట్టిగా లాగాడు. ఆమె సోఫాలో పడింది.

"పిల్లా, కరుపయ్యను కవ్విస్తే నీకు వేలకి వేలొస్తాయి!"

"అటువంటి డబ్బు నా కొద్దు!" అందామె.

అతను విరగబడి నవ్వాడు.

"మొదట్లో అలాగే అందరూ అంటారు. శరీరం పవిత్రమైంది అని పొరబడ్తారు. కాని పవిత్రమైన శరీరం తిండి లేకపోతే చస్తుంది! డబ్బుంటేకాని తిండిరాదు. అందు వలన అన్నిటికంటె పవిత్రమైనది డబ్బు, శరీరం కాదు! డబ్బు దేనిమీదా ఆధారపడదు. సవ్యసాచిలా అంతా సాధిస్తుంది!"

మాలతి మాట్లాడలేదు. ఆమె గుండె దడదడ కొట్టుకుంటోంది. తను ప్రేమించిన కుమార్ ఆమెకు గుర్తుకొచ్చాడు. ఉద్యోగం రాగానే కుమార్ తన్ని పెళ్ళాడ్తాడు.

గ్లాసులోని విస్కీని కరుపయ్య గడగడ తాగేశాడు. ఎక్కిళ్ళు వస్తున్నాయి! కింగ్ సైజ్ గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ వెలిగించాడు.

"మాలతీ, ఏమంటావు?"

"నన్ను ఇంటికి పోనివ్వండి. అమ్మా నాన్నా నా కోసం ఎదురు చూస్తూ వుంటారు. అమ్మకి బ్లడ్ ప్రెషర్!" ఆమె దీనంగా అతన్ని వేడుకుంది.

కరుపయ్య కళ్ళు ఎర్రబడ్డాయి. ఆమె చెంపమీద

గట్టిగా చేస్తో కొట్టాడు. ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారుస్తున్నాయి!

"నిన్ను ఇంటికి వెళ్ళనివ్వను! నిన్ను నేను అనుభవిస్తే గాని బయటకు పంపను!"

ఆమె లేచింది. దూరంగా పరుగెత్తింది. గుమ్మంవైపు చేరుకుంది. తలుపును బలంగా లాగింది. తలుపు తెరవబడ లేదు! కనకయ్య తాళం చెవిని ఆమెకు చూపించాడు!

"తలుపుకు తాళంవేసి అంతా కట్టుదిట్టం చేశాను!" అన్నాడతను పరిహాసంగా నవ్వుతూ.

మాలతి అతనికేసి ఆగ్రహంతో చూసింది.

"నన్ను ముట్టుకుంటే అరుస్తాను!" అందామె.

"ఇది సౌండ్ ప్రూఫ్ గది! నీ అరుపుల్ని ఎవ్వరూ వినరు!"

అతను గ్లాసులో విస్కీ పోసి కొద్దిగా సోడా కలిపి తొందరగా తాగేశాడు. తూలుతూ ఆమె దగ్గరకు నడిచాడు. ఆమె అతన్ని తన్నబోయింది. ఆమె కాళ్ళని అతను బలంగా పట్టుకున్నాడు. మాలతి వెనక్కి పడింది. కనకయ్య ఆమెమీదకు వాలాడు! మాలతి గింజుకుంటోంది. అతను ఆమె చీరను లాగేశాడు. పావడాను వూడదీశాడు.

ఆమె తన కాళ్ళను దగ్గరగా వుంచి అతనివైపు చూసింది. "దుర్మార్గుడా, నన్ను వదిలేయ్!" అందామె.

టెలిఫోన్ మ్రోగింది. అతను వెళ్ళి రిసీవర్ని ఎత్తాడు. "హలో కనకయ్య స్పీకింగ్!" అన్నాడతను.

"ఒళ్ళు రుద్దుకోవడానికి సబ్బులు లేక ప్రజలు కష్టపడుతున్నారు. నువ్వు సోప్స్ కి సోల్ డిస్ట్రిబ్యూటర్వి. నీ దగ్గరున్న సోపుల్ని వెంటనే మార్కెట్లో చీప్ గా అమ్ము! అలా చెయ్యకపోతే నీ సోప్సు మాయమవుతాయి!" అందొక గంభీర కంఠం.

తప్పతాగిన కరుపయ్యా పిచ్చివాడిలా నవ్వాడు.

"మిస్టర్, నువ్వెవరు?" అడిగాడు కరుపయ్యా.

"అది నీకు అనవసరం!"

"మిస్టర్, నువ్వు నన్ను బెదిరిస్తున్నావా? పోలీస్‌కి రిపోర్టిచ్చి నిన్ను అరెస్టు చేయిస్తాను." అన్నాడు కరుపయ్యా.

"చూద్దాం," అని అటువైపున రిసీవర్ పెట్టేయబడింది.

"దొంగనా కొడుకులు! భయపెడ్తె కరుపయ్యా లొంగడని వాళ్ళకు తెలియదు," అన్నాడతను.

మాలతి అతను ఫోన్‌లో మాట్లాడుతుండగా చీర కట్టుకుంది. అతను మళ్ళీ ఆమె దగ్గరగా వెళ్ళాడు.

కరుపయ్యా ఆమెమీద పడ్డాడు. అతడ్ని తోసేసి ఆమె దూరంగా పరుగెత్తింది. అతను ఆమెవైపు పరుగెత్తాడు. అతనికి దొరకకుండా ఆమె తప్పించుకుంటోంది!

అతను ఒగురుస్తూ సోఫాలో చతికిలబడ్డాడు. గ్లాసులో విస్కీ పోసుకుని కొద్దిగా సోడా కలిపి అతను తాగేశాడు. సిగరెట్ పీలుస్తూ దూరంలో నిలబడిన ఆమెకేసి చూశాడతను.

తప్ప తాగి అతను సోఫాలో పడుకున్నాడు. టీపాయి మీదున్న తాళం చెవిని ఆమె తీసుకుంది. తలుపు తెరచి బయటకు పరుగెత్తింది!

9

గోడౌన్ ప్రాంతంలో వాలి XYZ కారును ఆపి దిగాడు. గోడౌన్ దీపాలు వెల్గుతున్నాయి. కొంచెం దూరంలో కరుపయ్యా గోడౌన్ వుంది. వాలి గోడౌన్ చుట్టూ పహారా చేస్తున్నాడు.

ఒక లారీ వచ్చి గోడౌన్ ముందు ఆగింది. ఇద్దరు

వ్యక్తులు లారీలోంచి దిగారు. వాలి వాళ్ళవైపు నడిచాడు. డ్రయివర్, అతని అసిస్టెంట్!

"ఎవరిదీ లారీ?" అడిగాడు వాలి.

"ఇక్కడ వుండమన్నారు, సార్!" అన్నాడు డ్రయివర్.

"ఇక్కడ వుండటానికి వీల్లేదు. లారీని తీసుకుపో!" అరిచాడు వాలి.

డ్రయివర్ తికమకలు పడ్తున్నాడు! వాలిని చూస్తే అతని గుండె దడదడమంటోంది! లారీ కదిలింది. మెయిన్ రోడ్డుమీదకు పోయింది. కాస్సేపట్లో డాడ్జి కారొచ్చి లారీ పక్కనే ఆగింది. ఒకతను డ్రయివర్ కేసి చూశాడు.

"ఎందుకిక్కడున్నావు?" అడిగాడతను.

"గోడౌన్ ముందు లారీని ఆపకూడదని ఆయనన్నారు, సార్. అందుకని ఇక్కడ ఆపాను!" అన్నాడు డ్రయివర్.

"ఎవరాయన?"

"పొగరుమోతాయన, సార్. మనిషిని చూస్తేనే గుండె దడదడమంది సార్!"

డాడ్జి కారు కదిలింది. రోడ్డుమ్మట స్పీడుగా వెళ్తోంది. వెనకనే ఏదో కారొస్తోంది.

"స్పీడ్ పెంచు!" అన్నాడతను డ్రయివర్తో.

వెనకనుంచి కారు హెడ్ లైట్లు కన్పిస్తున్నాయి.

వెనకనుంచి వస్తూన్న కారు దగ్గరవుతోంది. కాస్సేపట్లో ఆ కారు ముందుకుపోయి చటుక్కున ఆగింది. అడ్డుగావున్న కారు వలన డాడ్జి కారు ఆగవలసి వచ్చింది.

XYZ కార్లోంచి వాలి దిగి వెనక్కి వచ్చాడు. డాడ్జి కారువైపు నడిచాడు. వెనుక సీటుమీద ఒంటరిగా కూర్చున్నతనివైపు చూశాడు.

"మిస్టర్, బయటకురా!" అన్నాడు వాలి.

అతను బయట అడుగు పెట్టాడు. వాలికేసి ఆశ్చర్యంగా చూశాడు.

"మీరా-!" అన్నాడతను.

"అబ్బాయి, నీ పేరేమిటి?" అడిగాడు వాలి.

"సేట్ గోకులదాస్," అన్నాడతను.

"లారీ డ్రయివర్ లో ఏమి మాట్లాడావ్?"

"గోడౌన్ అడ్డంగా లారీ ఆపవద్దని చెప్పాను!"

"నువ్వు నాతో పోలీస్ స్టేషన్ కి రావాలి!" అన్నాడు వాలి.

అతను మాట్లాడలేదు. నవ్వుతూ వాలికేసి చూశాడు. "నేను ఏం నేరం చేశాను?" అడిగాడతను.

వాలి చుట్ట పీలుస్తూ కారు నంబర్ను చూసి అతనివైపు తిరిగాడు.

"కరుపయ్యా పోలీసు రిపోర్టిచ్చాడు. అతని గోడౌన్ని లూటీ చేస్తున్నాడు. రక్షణ కావాలన్నాడు. మీ లారీ గోడౌన్ ముందుకొచ్చి ఆగింది!" అన్నాడు వాలి.

"అది నా లారీ కాదు!" అన్నాడు అతను.

డాడ్జ్ కారు కదిలింది. XYZ కారులో కూర్చుని వాలి శరవేగంగా గోడౌన్ ముందుకు వెళ్ళాడు. అక్కడ లారీలేదు. గోడౌన్కి వేసిన రెండు తాళం కప్పలూ సవ్యంగా వున్నాయి.

వాలి టైమ్ చూశాడు. ఒంటిగంట దాటింది. కారులో కూర్చుని వాలి స్పీడుగా పోనిచ్చాడు. ఒక మందుల షాపు ముందు కారును ఆపి దిగాడు. లోపలకు వెళ్ళి టెలిఫోన్ రిసీవర్ని ఎత్తి ఒక నంబరు తిప్పాడు.

"హలో, కమీషనర్ కామత్ స్పీకింగ్!"

"మిస్టర్ కామత్, కరుపయ్య గోడౌన్ కి ఏ ప్రమాదమూ సంభవించలేదు," అన్నాడు వాలి.

"గుడ్ న్యూస్ సార్," అన్నాడు కామత్.

తను చూసిన కారు నంబర్ని వాలి చెప్పాడు.

"కామత్ భాయ్, ఆ కారు ఎవరిదో కనుక్కో! ఆ కారులో కూర్చున్న వ్యక్తి పెద్ద మనిషిలా వున్నాడు. అందుకని పొమ్మన్నాను!" అన్నాడు వాలి.

"కనుక్కుంటాను, సార్," అన్నాడు కామత్.

వాలి డబ్బు చెల్లించి తన కారువైపు నడిచాడు. కార్ని వేగంగా తన హోటల్ వైపు పోనిచ్చాడు. చల్లటి గాలి వీస్తోంది. హోటల్ కాంపౌండ్లో కారు ఆగింది.

వాలి తన గదికి చేరుకున్నాడు. చుట్ట పీలుస్తూ కుర్చీలో వాలాడు.

టెలిఫోన్ మ్రోగింది. అతను వెళ్ళి రిసీవర్ని ఎత్తి, "హల్లో!" అన్నాడు.

"వాలిగారూ, కరుప్పయ్య గోడౌన్లోని సోప్పు స్టాకంతా మాయమైంది! లారీలో వేసుకుని వాళ్ళు పట్టుకు పోయారు," అన్నాడు కమీషనర్ కామత్.

"బాడ్ లక్," అన్నాడు వాలి.

10

"వాలి గారూ!" అన్నాడు కమీషనర్.

"చెప్పు!"

"ఆ కారు నంబరు హోమ్ మంత్రిగారి కారుది!"

"దాన్ని బట్టి అది ఫాల్స్ నంబరని మనకు తెలుస్తోంది!" అన్నాడు వాలి.

"కరుప్పయ్య గోడౌన్ని లూటీ చేసి స్టాకంతా పట్టుకు పోయిన వాళ్ళతో అతనికి సంబంధం వుండుండాలి!" అన్నాడు కామత్.

"యూ ఆర్ రైట్!"

"ఆ స్టాకంతా సివిల్ సప్లయిస్ కమీషనర్ స్వాధీనంలో వుంది. ముఖ్యమంత్రికి ఫోన్ కాలొచ్చింది. అంతా మునపటిలాగే జరిగింది. 93 పైసల రేటున ఆ సోప్సును ప్రజలకు కో ఆపరేటివ్స్ ద్వారా అమ్మబోతున్నారు!"

"ప్రజలకు ముఖ్యమైనవి తక్కువ ధరల్లో దొరుకుతున్నాయి! వాళ్ళను మెచ్చుకోవాలనిపిస్తోంది!" అన్నాడు వాలి.

"ముఖ్యమంత్రిగారు చాలా గాభరా పడుతున్నారు. వాళ్ళు చేసేది మంచి పనైనా వాళ్ళ పద్ధతులు చెడ్డవి! భారతదేశంలోని పౌరుల ఆస్తి పాస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిది. గోడౌన్స్ లూట్ చేసి సరకును పంచి పెట్టడం న్యాయంకాదు!"

"యూ ఆర్ రైట్!" అన్నాడు వాలి.

"వాలిగారూ, రోజురోజుకీ అరాచకం ఎక్కువవుతోంది. హోల్ సేల్ వ్యాపారస్థులెందరో వాళ్ళ స్టాకును పోగొట్టుకుంటున్నారు. ఇటుపైన స్టాకును తెప్పించకూడదని వాళ్ళు తీర్మానించారు! అప్పుడు ప్రజల గతి ఏమవుతుంది? అంతేకాదు. ఈ పట్నంలో జరిగినట్టే రాష్ట్రంలోని ఇతర పెద్ద పట్నాల్లో సాగుతోంది! అంటే ఇక్కడి రహస్య సంస్థ ఇతర పట్నాల్లో కూడా ఆపరేట్ చేస్తోందని మనం వూహించాలి! వాలిగారూ, మనం ఇప్పుడే వాళ్ళను ఆపకపోతే దేశమంతటా ఇటువంటి సంస్థలు రూపొందుతాయి. మన దేశంలోని వ్యాపార సంస్థలు దెబ్బతింటాయి. అరాచకం పెరిగి మన దేశాన్ని నాశనం చేస్తుంది!"

చుట్ట పీలుస్తూ కుర్చీమీద చేతులు ఆనించి వాలి కమీషనర్ వైపు చూశాడు.

"కామత్ భాయ్, వాళ్ళు మొదట ఫోన్ ద్వారా

వార్నింగ్ ఇచ్చి తర్వాత రెయిడ్ చేస్తున్నారు. వార్నింగ్ ఇవ్వగానే వ్యాపారస్తులు పోలీస్ రిపోర్టివ్వాలి. అప్పుడు మనం ఏదేనా చేసే అవకాశం లభిస్తుంది," అన్నాడు వాలి.

"పెద్ద వ్యాపారస్తులకు అలా చెయ్యమని హెచ్చరిక పంపుతాను. దాన్ని పాటించిన వాళ్ళకు మనం సహాయం చేయొచ్చు! దాన్ని నిర్లక్ష్యంచేసిన వాళ్లు నష్టపోతే తప్పు వాళ్ళదవుతుంది."

"వెంటనే అందర్నీ రహస్యంగా హెచ్చరించు." అన్నాడు వాలి.

కమీషనర్ బజర్ నొక్కాడు. పెర్సనల్ అసిస్టెంట్ గదిలోకొచ్చాడు.

11

కనకరాజు రిసీవర్ ఎత్తి, "హలో!" అన్నాడు.

"నువ్వు దాచిన సోఘుంగవ్వ బస్తాలను బయట పెట్టి సరైన ధరల్లో వెంటనే అమ్మేటట్టు చూడాలి. రాత్రి పన్నెండు దాకా నీకు టైమిస్తున్నాం. అటుపైన నువ్వు మా శిక్షకు గురవుతావు!" అందొక గంభీర కంఠం.

"ఈ బెదిరింపులకు భయపడే మనిషిని కాను నేను!" అన్నాడు కనకరాజు.

కోపంగా రిసీవర్ని పెట్టేశాడు. వెంటనే కమీషనర్ ఆఫీసుకి ఫోన్ చేసి తనని బెదిరిస్తూ ఫోన్ కాల్ వచ్చిందన్నాడు. అతని పేరూ, గోడౌన్ అడ్రెసూ ఇచ్చాడు. తగిన బందోబస్తు సమకూర్చుతామని పోలీస్ కమీషనర్ కామత్ హామీ ఇచ్చాడు.

రాత్రి పన్నెండయింది. రెండు పోలీస్ వాన్లు గోడౌన్ ముందు ఆగాయి. యాభైమంది కానిస్టేబుల్సు కిందకి

చూశారు. ఇన్‌స్పెక్టర్ నాయర్ వాళ్ళకు గంభీరంగా ఆర్డర్లు ఇస్తున్నాడు. కానిస్టేబుల్సు గోడౌన్ ముందు పచార్లు చేస్తున్నారు.

వస్తుందనుకున్నదైంది. XYZ కారును వాలి ఆపాడు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ వాలికి నవ్వుతూ నమస్కరించాడు.

“ఈసారి ఇంపాసిబుల్ సార్! ఎవ్వరూ గోడౌన్ దగ్గరకు రాలేరు,” అన్నాడు నాయర్.

“ఓ వెల్!” హెచ్చరించాడు వాలి.

* * *

కనకరాజు ఇంటి కాంపౌండులోకి కారు దూసుకుపోయి పోర్టికోలో ఆగింది. నిద్రపట్టక హాల్లో పచార్లు చేస్తున్న కనకరాజు బయటకు పరుగెత్తుకొచ్చాడు.

కార్లోంచి నాలుగు పిస్టల్సు అతని వేపు గురిపెట్టబడ్డాయి. అతను గాభరాగా వెనక్కి తిరిగి లోపలకు పోబోయాడు. భయంకరమైన చప్పుడు చేస్తూ మూడు సార్లు పిస్టల్సు మ్రోగాయి. కనకరాజు శరీరానికి తూట్లు పడ్డాయి. గావుకేక పెడ్తూ అతను గుమ్మంముందు బోర్లా పడ్డాడు. అనేక చోట్లనుంచి రక్తం చిమ్ముతోంది!

పోర్టికోలో ఆగిన కారు బయటకు దూసుకుపోయింది. లోపల్నుంచి రాజేశ్వరి బయటకు పరుగెత్తుకొచ్చింది. భర్తను చూసి ఆమె గట్టిగా అరిచింది. వెనకనుంచి నౌఖర్లు, పక్క ఇంటివాళ్ళు పరుగెత్తుకొచ్చారు.

కనకరాజు ముఖం రక్తమయంగా వుంది. రక్తంతో అతను ధరించిన పంచె, బనియన్ ఎర్రబడ్డాయి. పక్కింటి ధనంజయని కనకరాజు స్థితిని చూసి వెంటనే పోలీస్ రిపోర్టిచ్చాడు.

* * *

కనకరాజు ఇంటిముందు, రోడ్డుమీద పోలీస్ జీప్, వాన్ ఆగివున్నాయి. జీప్ వెనకే కారు ఆపి వాలి లోపలకు నడిచాడు.

విశాలమైన కాంపౌండు. పోర్టికోలో లైట్లు వెలుగుతున్నాయి. గుమిగూడిన మనుష్యుల మధ్యనుంచి వాలి ముందు వరండా మీదకు వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్ గబగబా వచ్చి అతనికి నమస్కరించాడు.

నేలమీద పడున్న మనిషిని వాలి పరీక్షగా చూశాడు.

“కనకరాజు ఈయనే సార్!” అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

వాలి వంగి శవంవైపు చూశాడు. మూడు బుల్లెట్లు అతని శరీరంలోకి జొచ్చుకుపోయి వుంటాయి!

“నాయర్ భాయ్, ఇతని గోడౌన్ని ఏమీ చేయలేక వాళ్ళ కసిని ఇతనిమీద ప్రదర్శించారు! ప్రజలకోసం పాటుపడే సంఘం హత్యల్లోకి దిగింది!” అన్నాడు వాలి.

[illegible] శోకంపెట్టి కూర్చుని ఏడుస్తున్న రాజేశ్వరివైపు వాలి దీనంగా చూశాడు.

“జరిగాయి, కాల్పులు ఎంత సేపైంది?”

“ఏదో కాల్పుల చప్పుడైంది సార్. నేను లోపల ఉన్నాను. నేను వచ్చేసరికి అంతా అయిపోయింది!” అందామె.

“ఆ కాల్పులు నువ్వు చూశావా?”

“లేదండి!”

“మరెవరైనా చూశారా?” అడిగాడు వాలి, నలువైపులా చూస్తూ.

పోర్టికోలో నిలబడిన ఒకతను వాలిదగ్గరకొచ్చాడు.

“నేను పక్కింట్లో పనిమనిషిని, సార్. బీడీ కాలుస్తూ రోడ్డుమీద నుంచున్నాను. ధాం ధాం చప్పుళ్ళు విని

ఉలిక్కి పడ్డాను. బయటకు పోతున్న నల్ల అంబాసిడర్ కారును చూశాను!" అన్నాడతను.

"నంబర్ చూశావా?"

"నంబరు సరిగ్గా కనబడలేదు సార్!"

"కారులో ఎంతమంది వున్నారు?"

"అరడజను మంది వున్నారు సార్."

వాలి పోర్టికోలోకి దిగి దూరంగా వున్న గేటు బయటకు నడిచాడు. అన్నీ పెద్ద ఇళ్ళు. ఇంటి చుట్టూ కాంపౌండులు. ఆలోచిస్తూ వాలి వెనక్కి నడుస్తున్నాడు. పోర్టికో దగ్గరున్న పూల మొక్క పక్కన ఆగాడు.

నేలమీద ఏదో కాగితం కదుల్తోంది. దాన్ని తీసి చూశాడు.

"మమ్మల్ని ఎదిరించిన వాళ్ళకు ఇదే శిక్ష!
సేవ్ ది పీపుల్ సొసైటీ!"

అని పెద్ద అక్షరాల్లో ముద్రించి వుంది.

చీటీని పట్టుకుని వాలి గబగబా ముందు వరండా మీదకు అడుగులేశాడు.

12

తన పడక కుర్చీలో వాలి కూర్చుని చుట్ట పీలుస్తున్నాడు. ఎదురుగా సోఫాలో పోలీస్ కమీషనర్ కామత్ ఆశీనుడయ్యాడు.

"వాలిగారూ, కోయంబత్తూర్, సేలమ్, తంజావూర్ పట్నాల్లో గోడౌన్సమీద దాడిచేసి సరుకును ఎత్తుకుపోయారు. ఆ సరుకు కలెక్టర్ల స్వాధీనంలో వుంది. వాళ్లు కో ఆపరేటివ్స్ ద్వారా ప్రజలకు అమ్మిస్తున్నారు!" అన్నాడు కామత్.

"ఇక్కడ తలెత్తిన సంఘం విస్తరించి రాష్ట్రమంతటా

తన కార్యక్రమాలను సాగిస్తోంది! ఇది మనం మొదట్లోనే అనుకున్నాం," అన్నాడు వాలి.

"కొన్ని సందర్భాలలో అహింస హింసకి దారితీస్తుంది. ఇక్కడ కనకరాజు ఘోరంగా హత్యచేయబడ్డాడు. ఇటు వంటి హత్యలు ఆ పట్నాల్లోనూ జరగొచ్చు!"

"సేవ్ ది కేపిటల్ సంఘాన్ని మనం ఆపవలసిన సమయం వచ్చింది. ఇంకా ఆలస్యం చేస్తే ప్రమాదం!" అన్నాడు వాలి గంభీరంగా.

"ఎలా ఆపడం? ఎక్కడా క్లూస్ దొరకడం లేదు! ఇంత జరిగినా మన పరిశోధన ఒక్కడుగు ముందుకు వెయ్యలేక పోయింది!"

వాలి గంభీరంగా నవ్వాడు.

"కామత్ ఛాన్స్. మనం ఒకేచోట నిలబడిపోయాం! నిజమే. కాని నిలబడిన వ్యక్తి అమాంతంగా దోషి మీదకు దూకగలడు!" అన్నాడు వాలి.

"ఏదో తొందరగా చెయ్యాలి, వాలిగారూ! అసెంబ్లీలో ప్రశ్నలు వేసి దుమారం లేపాలని కొందరు అపోజిషన్ సభ్యులు ఆలోచిస్తున్నారు!" అన్నాడు కామత్.

"డోంట్ బాదర్, ఆఖరికి మనం నెగ్గుతాం! రాష్ట్రంలోని తదితర పట్నాలకు వెళ్ళి అక్కడ కొంత దర్యాప్తు చేసి వస్తాను," అన్నాడు వాలి, చుట్టపొగ దట్టంగా వదులుతూ.

"గుడ్ లక్ సార్!"

13

పంచ, ఖద్దరు జుబ్బా ధరించాడు కుప్పుశెట్టి. తెల్లటి గెడ్డం, తలమీద తెల్లటి జుత్తు! పొడుగ్గా, లావుగా వున్నా డతను. కొబ్బరకాయల వ్యాపారంలో అతను

లక్షలు గడించాడు.

కుప్పుశెట్టి తన ఏర్‌కండిషండ్ గదిలో కూర్చున్నాడు. మార్కెట్ రిపోర్టులను చూస్తున్నాడు. టేబుల్ మీదున్న టెలిఫోన్ మ్రోగింది.

"హలో, కుప్పుశెట్టి కంపెనీ! ఎవరు కావాలి?" అడిగాడతను.

"అదే నే కావాలి!"

"అయితే నేనే!"

"పట్నంలోని ప్రజలకు కొబ్బరికాయలు లేకుండా చేస్తున్నావు," అందొక గంభీర కంఠం.

"లేకేం, అమ్ముతున్నాం. కాయి రెండు రూపాయలు!"

"ఆ రేటున మన దేశంలో ఎంతమంది కొనగలరు?"

"నువ్వు చెప్పేది బాగుంది. దేశంలోని వాళ్ళందరూ కొంటే అమ్మడానికి నా దగ్గర స్టాకెక్కడిది! డబ్బున్నోళ్ళు కొందరు కొనుక్కుంటారు!"

"మిస్టర్ కుప్పుశెట్టీ, నీ గోడౌన్‌లో దాచిన స్టాకును పన్నెండు గంటల్లోగా ప్రజలకు కాయ రూపాయి చొప్పున అమ్మాలి! అలా చెయ్యకపోతే కొబ్బరికాయలు గాలిలో ఎగిరిపోతాయి!"

"నువ్వెవరో గానీ, నీకు డజన్ కాయలిస్తాను, పట్టుకుపో! నన్ను వదిలేయి!" అన్నాడతను.

"నా కోసం పాటుపడ్డం లేదు నేను. ప్రజల కోసం!"

"ప్రజల్ని చూడ్డానికి ప్రభుత్వముందిగా!"

"ప్రభుత్వం కదలకపోవడం వలన మేం రంగంలోకి దిగవల్సి వచ్చింది."

అటువైపున రిసీవర్ పెట్టేయబడింది. కుప్పుశెట్టి గాభరాగా బెల్ నొక్కాడు. అరవై ఏళ్ళ అయ్యర్ పరుగెత్తుకొచ్చాడు.

"అయ్యగారూ, వాళ్ళు నాకూ ఫోన్ చేశారు!"

"ఏమన్నారు?"

"కొబ్బరికాయలు గాలిలో ఎగిరిపోతాయన్నారు!"

"పిచ్చోళ్ళు, అంత బరువైనవి గాలిలో ఎలా ఎగురుతాయి, సార్!" అడిగాడు అయ్యర్ అమాయకంగా.

"ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతూంటే కూర్చుని వినుట్నా వేమిటి? ఇప్పుడు మనం ఏం చెయ్యాలి!" అడిగాడు కుప్పుశెట్టి.

"పోలీస్ రిపోర్టిద్దాం, సార్!"

"అదేదో తొందరగా కానీ!"

అయ్యర్ రిసీవర్ ఎత్తి నంబరు తిప్పి పోలీస్ రిపోర్ట్ చేశాడు. పేరూ, అడ్రెసూ వివరంగా చెప్పాడు.

"మీరు గాభరా పడకండి! పోలీసులను కాపలా పెడ్తాం." అన్నాడు ఇన్స్పెక్టర్ అవతలి నుంచి.

అయ్యర్ ధన్యవాదాలర్పించి రిసీవర్ పెట్టేశాడు.

"మరేం భయంలేదు, సార్. మన ఆఫీసు, గోడౌన్లకు పోలీసోళ్ళు కాపలా వుంటారు. మన సరుకు ముట్టుకునే అవకాశం ఎవ్వరికీ వుండదు!" అన్నాడు అయ్యర్.

"అయ్యర్, సాయంత్రం మూడు కొబ్బరికాయలు పట్టుకెళ్ళి కొండవస్వామి గుడిలో నా పేర అర్చన చేయించు! పోలీసుల బలానికి దైవబలం కూడా తోడుగా వుంటుంది!" అన్నాడు కుప్పుశెట్టి.

"అలాగే సార్." అన్నాడు అయ్యర్.

14

గోడౌన్ ముందు వందమంది కానిస్టేబుల్స్ పహారా కాస్తున్నారు. పోలీస్ కమీషనర్ కామత్ కారు ఆగింది. ఇన్స్పెక్టర్ నాయర్ కారు దగ్గరకొచ్చి కమీషనర్ కి సెల్యూట్ చేశాడు.

"కుప్పుచెట్టి ఆఫీసు వెనక భాగంలో ఇల్లుందని విన్నాను. అక్కడ మన వాళ్ళను కాపలా వుంచారా?"

"వుంచాం సార్!" అన్నాడు నాయక్.

కమీషనర్ నలువైపులా చూసాడు. గోడౌన్ మీద దాడి చెయ్యడం సాధ్యంకాదు!

"వాలిగారు ఇంకా రాలేదు, సార్!" అన్నాడు నాయర్.

"ఆయన రాష్ట్రంలోని తదితర పట్నాలకు వెళ్ళుంటారు!"

పోలీస్ కమీషనర్ కారు కదిలింది. కుప్పుచెట్టి ఇంటి ముందునుంచి కారు మెల్లిగా వెళ్తోంది. అక్కడ కాపలా వున్న వాళ్ళవైపు కమీషనర్ తృప్తికరంగా చూశాడు.

పన్నెండు దాటింది. కుప్పుచెట్టి ఇంటి ముందు ఒక పాత హిండ్సన్ కారు ఆగింది. నలుగురు మొగాళ్ళు, ముగ్గురు స్త్రీలు కిందకి దిగారు. ఆడవాళ్ళ చేతుల్లో మూటలున్నాయి. నలుగురు మొగాళ్ళకూ తలమీద వెంట్రుకలు లేవు. నున్నగా గీసిన బోడిగుళ్ళు!

తిరపతి వెళ్ళి వస్తున్నట్టున్నారు!

"వాళ్ళు చుట్టాలై వుండాలి!" అన్నాడొక కానిస్టేబుల్.

వాళ్ళను గురించి కానిస్టేబుల్సు అంతగా పట్టించుకోలేదు!

వాళ్ళు తలుపును తట్టారు. అయ్యరు తలుపు తెరిచి వాళ్ళకేసి విచిత్రంగా చూశాడు.

"మావయ్య వున్నారా?" అందొక స్త్రీ.

"కుప్పుచెట్టి బావ!" అంది మరో స్త్రీ.

అయ్యర్ వెనకనే వాళ్ళు ఏర్‌కండిషండ్ గదిలోకి ప్రవేశించారు. వాళ్ళ కేసి కుప్పుచెట్టి ఆశ్చర్యంగా

చూశాడు.

కాలి కిందనున్న బటన్ నొక్కాడు!

నల్గురు మొగాళ్ళ చేతుల్లోనూ పిస్టల్స్ మెరుస్తున్నాయి. ట్రిగ్గర్స్ మీదకి వేళ్ళు కదులుతున్నాయి.

కుప్పచెట్టి తటాలున చెయ్యి ఎత్తాడు. నాలుగుసార్లు వాయువేగంగా పిస్టల్‌తో షూట్ చేశాడు. వాళ్ళ చేతుల్లోని పిస్టల్స్ ఎగిరి దూరంగా పడ్డాయి.

"కదలకండి! కదిలితే చస్తారు!" అర్చాడు కుప్పచెట్టిలా నటించిన వాలి.

అతని గంభీర కంఠాన్ని విని వాళ్ళు అలాగే నిలబడిపోయారు. వెనక్కి తిరిగారు. పోలీసు కానిస్టేబుల్స్ లోపలకు జొరబడ్డారు.

"వాళ్ళందర్నీ పట్టుకోండి!" అర్చాడు వాలి.

మొగాళ్ళకూ, ఆడాళ్ళకూ బేడీలు వేయబడ్డాయి.

"వాళ్ళను తీసుకెళ్ళి కారులో కూర్చోబెట్టండి," అన్నాడు వాలి.

కానిస్టేబుల్స్ వాళ్ళను బయటకు లాక్కుపోయారు. వాళ్ళ పిస్టల్స్‌ను సబిన్‌స్పెక్టర్ రామన్ గుడ్డల్లో చుట్టి బాగ్‌లో పడేసుకున్నాడు.

పక్క గదిలోకి వెళ్ళాడు వాలి.

తన సూటూ, బూట్లూ ధరించాడు. హాయిగా నిద్రపోతున్న కుప్పచెట్టిని మెల్లిగా తట్టి లేపాడు.

"ఇటుపైన నువ్వు బెంగ లేకుండా పడుకోవచ్చు! వాళ్ళు మాకు పట్టుబడ్డారు. కాని కొబ్బరికాయల ధర తగ్గించు" అన్నాడు వాలి నవ్వుతూ.

* * *

పాత హడ్సన్ కారు వెనకనే పోలీస్ జీప్, వాన్ వస్తున్నాయి.

"ఎక్కడికి వెళ్ళాలి? మీ రహస్య స్థావరం ఎక్కడ?"

"తెలియదు!" అర్చాడు ఒకతను.

వాలి అతని చెయ్యిని మెలితిప్పాడు. నొప్పితో అతను అరుస్తున్నాడు.

"ఎక్కడ?" అర్చాడు వాలి.

"ఇంకా ముందుకు వెళ్ళాలి!"

ఒక పెద్ద కాంపౌండులోకి కారు వెళ్ళింది. వెనకనే జీప్, వాన్ లోపలకు ప్రవేశించాయి. వాలి కిందకి దూకాడు. వాన్ లోంచి కిందకి వురికిన సాయుధపోలీసులు ముందువరండా మీదకు పరుగెత్తారు.

వాలి తలుపును తట్టాను. కాస్సేపట్లో తలుపు తెరవబడింది. ఎదురుగా నిలబడిన పచ్చటి వ్యక్తికేసి వాలి సూటిగా చూశాడు. ఆనాడు డాడ్జి కారులో తను చూసిన సేట్ గోకులదాస్!

అతను నవ్వుతూ వెనక్కి జరిగాడు.

"వాలిగారూ!" అన్నాడతను.

వాలి ముందుకు వెళ్తున్నాడు. అతను సోఫాలో కూలబడ్డాడు.

"మేం ఎప్పుడో అప్పుడు మీ చేతుల్లో పడ్తామని నాకు తెలుసు!" అన్నాడతను.

"సేవ్ ది పీపుల్ సొసైటీ మంచిగా ప్రారంభమై హత్యల్లోకి దిగింది!" అన్నాడు వాలి.

సేట్ గోకులదాస్ తన ముఖాన్ని కప్పిన మాస్కును తీసేసి ప్రక్కగా విసిరాడు. అందరూ అతనికేసి ఆశ్చర్యంగా చూశారు.

ప్రఖ్యాత రాజకీయవేత్త, ఎమ్.పి. మధుసూదన్!

"వాలీగారూ, సదుద్దేశంతో సేవ్ ది పీపుల్ సొసైటీని స్థాపించాను. వుద్యోగాలు లేనివాళ్ళెందర్నో సభ్యులుగా చేర్చాను. చీకట్లో దాగిన స్టాకుని వెలుతుర్లోకి తెచ్చి ప్రభుత్వానికి అందజేయాలని నా ఆశ. మొదట్లో అలాగే జరుగుతూ వచ్చింది. నాకు తెలియకుండా కనకరాజును వాళ్ళు చంపారు. అతడ్ని భయపెట్టి వదిలేయమన్నాను. నా ఆజ్ఞను కొందరి యువరక్తం పాటించలేక పోయింది. ఆవేశాలకు లోబడి అతడ్ని చంపేశారు! ప్రజలకోసం పాటుబడే ఈ సంస్థను మూసేద్దామనుకుంటున్నాను. అది జరిగేముందు మీ చేతిల్లో చిక్కుకున్నాం. ఒకప్పుడు జెయిల్లో ఏళ్ళ తరబడి కూర్చున్న నాకు జెయిలు శిక్షంటే భయం లేదు. వాలిగారూ, నేను మీకు లొంగిపోతు న్నాను" అన్నాడు మధుసూదన్.

15

సేవ్ ది పీపుల్ సొసైటీ సభ్యులందరూ అరెస్ట్ చేయబడ్డారు.

పోలీస్ కమీషనర్ ఆఫీసు ముందు వాలి కార్ను ఆపి గబగబా అతని గదిలోకి వెళ్ళాడు.

కమీషనర్ కామత్ నవ్వుతూ అతనితో కరచాలనం చేశాడు.

"కామత్ భాయ్, నిలబడిన వ్యక్తి దోషి మీదకి అమాంతంగా దూకొచ్చన్నాను! ఒప్పుకుంటావా?" అడిగాడు వాలి.

"యూ ఆర్ రైట్, వాలిగారూ! మీరు ఏ కోయంబత్తూరో వెళ్ళారనుకున్నాను. మీరు రంగంలో వున్నారని విని ఆశ్చర్యపోయాను!"

"కామత్ భాయ్, కథల్లోలాగే మనం చేసే కార్య

క్రమాలకు కొంత సస్పెన్స్, కొద్దిగా మిస్టరీ వుంటే మంచిది?'' అన్నాడు వాలి నవ్వుతూ.

వాలి కుర్చీలో కూర్చుని ఎదురుగా వున్న కామత్ కేసి చూశాడు.

"కామత్ భాయ్, సేవ్ ది పీపుల్ సొసైటీలో మొత్తం నూటయాభై మంది సభ్యులున్నారు. యాక్టివ్ గా పనిచేసే వాళ్ళు యాభైమంది. ఆ యాభైమందిలో ఆరుగురు కనక రాజు ఇంటికి వెళ్ళి అతడ్ని చంపారు. కొందరు స్త్రీలు కూడా ఈ సొసైటీలో మెంబర్లు!'' అని ఆగాడు వాలి.

"కోయంబత్తూర్, సేలం, తంజావూరులోని సభ్యులను ఈపాటికి అక్కడి పోలీసులు అరెస్టు చేసుంటారు. చీడలా వ్యాపిస్తున్న ఈ సంఘం పూర్తిగా ధ్వంసం చేయబడింది.

అటువంటి వాళ్ళు ఈ పట్నంలో తలెత్తకుండా నువ్వు జాగ్రత్త పడాలి!'' అన్నాడు వాలి.

"వాలిగారూ, అంత గొప్ప రాజకీయవేత్త, దేశభక్తుడు మధుసూదన్ ఈ సంస్థకు స్థాపకులవడం ఆశ్చర్యంగా వుంది!'' అన్నాడు పోలీస్ కమీషనర్ కామత్.

"కామత్ భాయ్, మధుసూదన్ సరైన మార్గంలో ఈ సంస్థ నడుస్తుందని అనుకున్నాడు. అనేకమంది అందులో వుండడం వలన అది వక్రమార్గాన్న పడింది. మునుపు గాంధీజీ అహింసా విధానంలో ఏదో వుద్యమాన్ని ప్రారంభించేవారు. కొంత కాలమయ్యేసరికి అది హింస కాండల్లోకి దిగేది. వెంటనే గాంధీజీ తన వుద్యమాన్ని మానుకునేవారు! ఇది గాంధీజీ కాలం కాదు! బట్ హిస్టరీ రిపీట్స్ ఇట్ సెల్ఫ్!'' అన్నాడు డిటెక్టివ్ వాలి.

—: ఐపోయింది :—